క్లుప్తంగా

విధుల్లో అందించిన సేవలతో ఉద్యోగికి గుర్తింపు



పాలంగిలో వీఆర్వో సత్యనారాయణను సత్కరిస్తున్న పంచాయతీ పాలకవర్గం

ఉండ్రాజవరం: ఉద్యోగి సర్వీసులో ఉన్నప్పుడు చేసిన సేవలు వ్యక్తికి గుర్తింపును తీసుకువస్తాయని రిటైర్డ్ ప్రిన్సిపాల్, కవి వాడ్రేవు సుందరరావు అన్నారు. ఇటీవల పాలంగి వీఆర్వోగా పదవీ విరమణ పొందిన కోటిపల్లి సత్యనారాయణను శుక్రవారం పాలంగి గ్రామ పంచాయతీ వద్ద పాలకవర్గం సభ్యులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బొక్క శ్రీనివాస్ మాట్లాడుతూ వీఆర్వోగా సత్యనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలో సత్యనారాయణకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు



తాళ్లపూడిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడి కాలువ సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. తాళ్లపూడి పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం చిడిపి గ్రామానికి చెందిన సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న షేక్‌ఫిర్ సాహెబ్ బల్లిపాడునికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న పొనుకుమాటి నవీన్ ఎదురెదురుగా వస్తుండగా కాలువ గట్టు సమీపంలో ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులైన ఇద్దరు మోటార్‌సైక్లిస్టులను 108లో రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. తాళ్లపూడి పోలీసులు ఘటనా ప్రదేశంలో వివరాలను సేకరించారు.

ఉద్యాన కళాశాల విద్యార్థులకు అవగాహన



తెలికిచెర్లలో ఉద్యానకళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టరు కరుశ్రీ

నల్లజర్ల: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోఉద్యాన కళాశాల బీఎస్సీ 3వ సంవత్సరం విద్యార్థులకు వివిధ అంశాలపై తెలికిచెర్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విస్తరణ విభాగం ఆచార్యులు డాక్టరు కరుణశ్రీ పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. సర్పంచ్ బండి చిట్టి గ్రామ పరిపాలన, సచివాలయాల సేవలు వివరించారు. గ్రామ ఉద్యాన సహాయకులు సురేష్, అభ్యుదయ రైతులు రామరాజు, వెంకటేశ్వరావు, కళాశాల సహయ ఆచార్యులు అర్చన, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం

కంబాలచెరువు: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యా నేరమని, ఎవరైనా ఎక్కడైనా నిర్వహిస్తే వారి లైసెన్సు రద్దు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ హాలులో డీఎం అండ్ హెచ్‌వో అధ్యక్షతన ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, గవర్నమెంట్ స్కానింగ్ సెంటర్స్‌కు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ఇంప్లిమెంట్‌పై కెపాసిటీ బిల్డింగ్ పేరుతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం అనే బోర్డులను ప్రదర్శించాలని, స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణులు స్కానింగ్ చేసినప్పుడు వారికి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. అలా చేస్తే . భారతీయ శిక్షాస్మృతిలో 1994 యాక్ట్ ప్రకారం మొదటిసారి వారికి 50 వేలు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించి, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. అనంతరం బెస్ట్ వైలెన్స్ ఎండ్ మెడికో లీగల్ కేర్ ఫర్ సూపర్‌వైజర్లకు వైలెన్స్‌పై స్కానింగ్ సెంటర్స్ వారికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ పీఎస్ఎల్.ప్రసన్న, డాక్టర్ సంధ్య, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై నాగరత్నం, సీడీపీవో నర్సమ్మ పాల్గొన్నారు.

నేడు ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం బొమ్మూరులోని నరసింహరాజు ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని సంఘ సభ్యులతో పాటుగా గతంలో సభ్యులుగా ఉన్న విశ్రాంత ఉద్యోగులు, ప్రమోషన్స్‌పై వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారే కాకుండా తెలంగాణ నుంచి అనేక మంది పాల్గొంటున్నారన్నారు.

అధ్వాన రహదారిలో అగచాట్లు

- ప్రయాణికుల కష్టాలు తీరే దారేదీ?
- నిడదవోలు– నరసాపురం ఆర్అండ్‌బీ రోడ్డు ఛిద్రం
- దుమ్ము, ధూళి ఎగసిపడుతున్న వైనం
- ప్రమాదాలబారిన పడుతున్న ద్విచక్ర వాహనదారులు



ఉసులుమర్రు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై దుమ్ము లేస్తున్న దృశ్యం

పెరవలి: నిడదవోలు– నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో గోతులు పూడ్చి రాళ్ల వేయటంతో అవి లేచి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒకవైపు రాళ్ల లేచి ఉండటం, మరోవైపు రోడ్డుపై వచ్చే వాహనాలతో దుమ్ము పైకి ఎగసిపడి దారి కనిపించకపోవటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో ఉసులుమర్రు నుంచి కానూరు వరకు ఉన్న 3 కిలోమీటర్ల మేర ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తోందని వాహనదారులు, బాటసారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు కిలోమీటర్ల రహదారిలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అనుక్షణం భయపడవలసి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు వచ్చినప్పుడు రోడ్డుపై లేచి ఉన్న రాళ్ల టైర్ల ఒత్తిడికి ఎగిరి వచ్చి తగటడంతో ద్విచక్ర వాహనదారులు, బాటసారులు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఒకవైపు రాళ్ల దెబ్బలు తగులుతుంటే మరో వైపు దుమ్ము వచ్చి కళ్లల్లోపడి నానా పాట్లు పడుతున్నారు. రోడ్డులో గోతులు ఉండేటప్పుడు వాహనాలు చాలా నెమ్మదిగా వచ్చేవని, ఇప్పుడు రాళ్ల లేచి ఉన్నా వాహనాలు చాలా వేగంగా రావటంతో ఇబ్బంది పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ ప్రయాణం చేస్తున్నామని వాహనదారులు అంటున్నారు. నిడదవోలు -నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో ముఖ్యంగా ఉసులుమర్రు, కానూరు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. మూడు నెలల్లో ఈ రహదారిలో జరిగిన 25 ప్రమాదాల్లో 17 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. ఈ రోడ్డులో లేచి వస్తున్న దుమ్ము ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడి ఆసుపత్రిపాలవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా మేల్కొని కనీసం రోడ్డుపై పైకి లేచిన రాళ్లను తొలగించి, దుమ్ము ఎగరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.



కానూరు వద్ద ఏర్పడిన గోతులు పైకి కనిపిస్తున్న రాళ్ళు

పట్టించుకునే నాథుడు లేరు



కానూరు నుంచి ఉసులు మర్రు వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. రాళ్ల, దుమ్ము వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తోంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోనే నాథుడు లేరు.

– కొమ్మిశెట్టి రాము, కానూరు

దుమ్ము, ధూళితో ఇబ్బంది



రాళ్ల లేచి ఉండటం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు రోడ్డుపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి వాహనాలు వచ్చినప్పుడు పైకిలేచి ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. దీంతో గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నాం.

– కాపకా పాపారావు, కాకరపర్రు

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం

కొవ్వూరు: పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు తెలిపారు.వైఎస్సార్ సీపీలో వివిధ హోదాల్లో మహిళా ప్రజాప్రతినిధులకు సత్కరించనున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

నేడు యర్నగూడెంలో మహిళా దినోత్సవం

దేవరపల్లి: యర్నగూడెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత తెలిపారు. ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల మహిళలు, జెడ్పీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

చాగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ కేపీ పావని తెలిపారు. 104 మంది విద్యార్థులకు 99 మంది హాజరైనట్టు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బోటనీ, సివిక్స్, మాథ్స్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. పరీక్షల నిర్వహణ తీరును ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించింది.

ఆశీలు వసూలు విధానంపై సమీక్షించాలి





కొవ్వూరు పురపాలక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి . సమావేశానికి హాజరైన సభ్యులు

కొవ్వూరు: పురపాలక సంఘం పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆశీల వసూలు అంశాన్ని సమీక్షించి, మార్పులు, చేర్పులు చేపట్టాలని సభ్యులు సూచించారు. చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో వాయిదా పడిన ఆశీల రుసుము వసూలు నిర్ధారణ అంశం మళ్లీ సమావేశంలో పదో అంశంగా పొందుపరిచారు. దీనిపై సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని చైర్‌పర్సన్ రత్నకుమారి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుండగా ఇసుక వాహనాల నుంచి ఆశీలు వసూలు చేయడం సరికాదని ఈ అంశాన్ని తొలగించాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, కండెల్లి రామారావులు కోరారు. ఇసుకపై ఏవిధమైన ఆశీలు వసూలు చేయకుండా చూడాలని సూచించారు. ధాన్యం, రైతుల పొలంలోంచి తోలుకునే మట్టి, పశువుల పెంట వంటి వాటికి సైతం మినహాయింపు ఇవ్వాలని ఒకటో వార్డు కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ కోరారు. కూరగాయలు, ఆకుకూరలు వివిధ రకాల నిత్యావసరాలు, సంతలో దుకాణాల నుంచి వసూలు చేసే అంశంపై సభ్యులు రుత్తల భాస్కరరావు పలు సూచనలు చేశారు.

సమస్యలపై సభ్యుల ఆవేదన

పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, చెత్త సేకరణకు వినియోగించే రెండు వాహనాలు పని చేయడం లేదని, ఆటోలు మూలనపడ్డాయని కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు ఆరోపించారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ చేస్తామని చెబుతున్నారు. ఏ జంక్షన్‌లో చూసినా చెత్త గుట్టలు కనిపిస్తున్నాయన్నారు. దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ చెత్త తొలగింపునకు రెండు ట్రాక్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మరమ్మతుకు గురైన ఒక్కో వాహనాన్ని బాగు చేయడానికి రూ.12 లక్షలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్‌లో ఉండడంతో మరమ్మతుల సొమ్ము ప్రభుత్వం నుంచి రావడానికి ఆలశ్యం అవుతుందని ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు వివరించారు.15వ వార్డులో లైట్లు సక్రమంగా వెలగడం లేదని, పారిశుద్య కార్మికులను పెంచాలని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కౌన్సిలర్ కండెల్లి రామారావు కోరారు. పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అజెండాలో పేర్కొన్న 36 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పేర్కొన్న ఒక్క అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వైస్ చైర్మన్ గండ్రోతు అంజనీ దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు కమిటీ సమావేశం



తాళ్లపూడిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కమిటీ సమావేశం

తాళ్లపూడి: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేసేలా మండల కమిటీ పర్యవేక్షించాలని ఎంఈవో1, సీహెచ్ బాలామణి, ఎంఈవో 2 సీహెచ్ నెహ్రూజీ కోరారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులతో పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ మాట్లాడుతూ పాఠశాలల్లో కొత్త మోనూను అమలు చేస్తామని తెలిపారు. దీని పర్యవేక్షణకు మండల స్థాయిలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ మోహన భారతి, పీహెచ్‌సీ వైద్యాధికారి హరికా గుప్త, తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఎంఈవో బాలామణి, ఎంఈవో 2 నెహ్రూజీలు ఉంటారని తెలిపారు. వారితో పలు విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో మండల కమిటీతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు పాల్గొన్నారు.

రీ సర్వే ద్వారా భూ సమస్యల పరిష్కారం



తాళ్లపూడి పరిధిలోని కుకునూరులో రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

తాళ్లపూడి: రైతులకు చెందిన భూ నిర్ధారణ సర్వే దృష్టికి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని తహసీల్దార్ పి మోహనభారతి తెలిపారు. తాళ్లపూడి పరిధిలోని కుకునూరు సచివాలయం వద్ద శుక్రవారం వీరభద్రపురానికి సంబంధించి రీ సర్వేపై గ్రామ సభను నిర్వహించారు. భూ నిర్ధారణ, పాత వెబ్ ల్యాండ్ అడంగల్‌లో లోపాలను సరిచేయడానికి రైతుల నుంచి వచ్చి అభ్యంతరాలను తీసుకుని చర్చించారు. ఈ గ్రామ సభలో యజమానుల సర్వే నంబర్లు, విస్తీర్ణం, యజమాని పేరు చదివి వినిపించారు. రైతుల భూములు హెచ్చు తగ్గులకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోహనభారతి మాట్లాడుతూ 182 మంది రైతులు తమ భూములకు సంబంధించి వివరాలు ఈ సభలో వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టీవీ రావు, ఆర్ఐ కె రామకృష్ణ, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, వీఆర్వోలు లీలావతి, పి విజయకుమారి, సంజీవరావు, విలేజ్ సర్వేయర్లు అలేఖ్య, కె విజయ దుర్గా, ఎస్ ప్రియా, రైతులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయం

కొవ్వూరు: మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీ అజయ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సహచర ఉద్యోగులు సత్కరించారు. డీఈఈ అజయ్ బాబు చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఏఈలు కె. రాజాతిలక్, ఎస్‌కే సూర్జహాన్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వైద్య ఉద్యోగులకు సత్కారం

నల్లజర్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విశేష సేవలు అందించిన మహిళా ఉద్యోగులను నల్లజర్ల సీఐ విజయశంకరం శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించిన నర్సుల పాత్ర మరువలేనిదన్నారు. డాక్టర్ గంగాధరరావుతో కలసి వైద్య ఉద్యోగులను శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టరు గంగబూదరరావు, సీహెచ్ఓ ప్రసాద్, మహిళా సూపర్‌వైజర్ అన్కనమ్మ, స్టాఫ్ నర్సులు నాగమణి, రాణిప్రసన్న, కవిత, దీవెన, శానిటరీ వర్కర్ లక్ష్మి, జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మహిళ ఉద్యోగులను సత్కరించిన దృశ్యం

ఆధునిక సమాజంలో స్త్రీ పాత్రపై వక్తృత్వ పోటీలు

కొవ్వూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆధునిక సమాజంలో మహిళల పాత్ర, మహిళా చట్టాలు అంశంపై పట్టణంలో ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తకెళ్ల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు మర్రి వెంకటేష్, జాయింట్ సెక్రటరీ వై ప్రకాష్, ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై రమేష్, కళాశాల మహిళా సాధికారిత సెల్ సభ్యులు జి.అనుష, ఎ.రాణి, జి గౌతమీ అధ్యాపకులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు శనివారం ఉమెన్స్ డే సందర్భంగా బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



మహిళా వైద్య ఉద్యోగులను సత్కరిస్తున్న సీఐ విజయశంకరం

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారాలు

దేవరపల్లి: గ్రామంలో వేంచేసిన బాలదుర్గమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఇద్దరు చిన్నారులను పటికబెల్లంతో కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద్దకాపవరానికి చెందిన జడ్డు అనిల్ కుమార్, కుసుమలత దంపతుల కుమారుడు యశ్వంత్ కళ్యాణ్, కుమార్తె రష్మితను కుటుంబ సభ్యులు పటికబెల్లంతో తులాభారం వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



బాలదుర్గమ్మ ఆలయంలో బాలుడికి తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



దుద్దుకూరులో పునర్నిర్మించిన సీతారామస్వామి దేవాలయం

దేవరపల్లి: దుద్దుకూరులో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం రాత్రి సీతారాములకు ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. దాతల సహకారంతో సుమారు రూ.2 కోట్లతో సీతారామస్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఆదివారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హోమాలు, పూజలు చేశారు.

వీరవల్లిలో రీ సర్వే పూర్తి



అనంతపల్లిలో వివరాలు తెలియజేస్తున్న తహసీల్దార్ నాయుడు

నల్లజర్ల: రీ సర్వేకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన వీరవల్లి గ్రామంలో రీ సర్వే పూర్తయిందని తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు తెలిపారు. ఈ వివరాలను అనంతపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన వెల్లడించారు. గ్రౌండ్ ట్రూతింగ్ వివరాలు రైతులకు వివరించారు. అభ్యంతరాలుంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ కమల కుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, వీఆర్వో రామసీత, సర్వేయర్ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ఇంటి, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించండి



ఎస్.రవికిషోర్, పంచాయతీ కార్యదర్శి, దేవరపల్లి

దేవరపల్లి: 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీకి చెల్లించవలసిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 25 నాటికి పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. పన్నుల వసూళ్లు మందకొడిగా జరుగుతున్నాయని, సిబ్బంది ఇంటింటికీ వస్తున్నందున పన్నులు చెల్లించి ఆన్‌లైన్ రశీదు పొందాలని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలో డిజిటల్ పేమెంట్లు జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. సకాలంలో పన్నులు చెల్లించని యజమానులపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వ్యాపారస్తులు తమ వ్యాపార అనుమతులకు లైసెన్స్ ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు.

వైద్యురాలు పఠాన్ మస్తాన్‌బీకి అభినందనలు



వైద్య విద్యను పూర్తి చేసిన పఠాన్ మస్తాన్‌బీ

దేవరపల్లి: ఎంబీబీఎస్ పూర్తి చేసి స్వగ్రామానికి వచ్చిన దేవరపల్లికి చెందిన పఠాన్ మస్తాన్‌బిని పలువురు అభినందించారు. శుక్రవారం సాయంత్రం మస్తాన్‌బీ స్వగృహం వద్ద ఆమెను మానవత మండల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కురిసేటి రామరాజు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా పఠాన్ మస్తాన్‌బి మాట్లాడుతూ పీజీలో ఎండీ జనరల్ చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. తన చదువుకు తల్లిదండ్రులు, తాతయ్య జహంగీర్ ఎంతో సహకరించారని తెలిపారు. ప్రాథమిక విద్యను దేవరపల్లిలోని లిటిల్ హార్ట్స్ పాఠశాలలోనూ, ఇంటర్ నల్లజర్ల ఏకేఆర్‌జీ కళాశాల, ఎంబీబీఎస్ విద్య విజయవాడలోని ఇబ్రహీంపట్నం వైద్య కళాశాలలో పూర్తి చేసినట్టు వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.